క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బ్రహ్మం కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పురపాలక సంఘం 7వ వార్డు గిజబ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బ్రహ్మం కుమారుడు అనారోగ్య కారణంగా మృతి చెందగా విషయాన్ని పట్టణ నాయకులు ద్వారా తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం బ్రహ్మజీ నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జరిగిన ఘటనకు చింతిస్తూ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ వారికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయనతో పాటు పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, కౌన్సిలర్ సభ్యులు రణభేరి చిన్నంనాయుడు, ఆత్మ మాజీ చైర్మన్ యాంద్రాపు తిరుపతిరావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి



గెలుపొందిన జట్లకు ప్రశంసాపత్రాలు అందజేసిన రూరల్ సీఐ గోవిందరావు, ఎస్ఐ సంతోషికుమారి

పార్వతీపురం టౌన్: యువత అన్ని రంగాల్లో రాణించాలని రూరల్ సీఐ గోవిందరావు అన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో శనివారం మండలంలోని వెంకంపేట శివారులో నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలన్నారు. క్రీడలతో శారీరక ధృడత్వంతో పాటూ ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. మండలానికి చెందిన పలు గ్రామాల నుంచి 20 జట్లు పాల్గొన్నాయని తెలిపారు. విజేతలుగా నిలిచిన వారికి ఎస్ఐ సంతోషికుమారి ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధి పి.శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.


సేవలకు గుర్తింపు



అవార్డు అందుకుంటున్న వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సూర్యారావు

పార్వతీపురం: వినియోగదారులకు అందించే సేవలను గుర్తించి విశాఖపట్నం టీవీ టూరిజం సంస్థ భారత సేవా ద్రష్ట అవార్డు ప్రధానం చేసిందని జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పెంటపాటి సూర్యారావు పేర్కొన్నారు. 2025 సంవత్సరానికి సంబంధించి విశాఖపట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును తనకు ప్రధానం చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నో ఏళ్లుగా వినియోగదారులకు హక్కులు, సేవలపై చేస్తున్న కృషిని అభినందించి ఈ అవార్డును అందజేసినట్లు తెలిపారు. ఈయనకు అవార్డు రావడం పట్ల సంఘ సభ్యులు ఎన్.మధుసూదనరావు, ఎం.రామకృష్ణ, జి.అప్పలరాజు, ఎం.ఈశ్వరరావు, వి.శ్రీహరిరావు, ఊర్మిలమ్మ తదితరులు అభినందించారు.

జాగ్రత్తలతోనే పశు సంపద వృద్ధి



పశువైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చక్రధర్

పార్వతీపురం టౌన్: సీజన్ ప్రకారం మూగజీవాలైన పశువులకు వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, అప్పుడే పశు సంపదను మరింత పెంపొందించగలమని పశువైద్యాధికారి భోగి చక్రధర్ అన్నారు. ములగ పంచాయతీలో గల పశువులకు ప్రత్యేక పరీక్షలు శనివారం నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పశువైద్య శిబిరాలు మండలంలో ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. వైద్య శిబిరాల్లో వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులను రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: ఈఎంఆర్‌ఎస్‌లో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఐదో తరగతి పాసైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భామిని, మెళియాపుట్టిలలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మొత్తం 120 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. వచ్చేనెల 19వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

తగ్గనున్న టెన్షన్

- ఆరు సబ్జెక్టులు • ఏడు పేపర్లు • 100 మార్కుల పేపర్ • విద్యార్థులకు ఊరట





పదో తరగతి విద్యార్థులు

బలిజిపేట:

పదవ తరగతి పరీక్షల్లో ఆరు సబ్జెక్టులకు ఏడు పేపర్ల విధానంతో విద్యార్థులపై ఒత్తిడి తగ్గి మానసిక సంసిద్ధతకు బలం చేకూరింది. పదవ తరగతి పరీక్షలు అనగానే విద్యార్థుల్లో హడావుడి, మానసిక ఒత్తిడి సాధారణం. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లితండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. గతంలో 11రోజులు పరీక్షలు రాయడం వల్ల విద్యార్థులు ఎంతో ఒత్తిడికి గురయ్యేవారు. వారిలో ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం పరీక్షకు పరీక్షకు మధ్య ఒక రోజు విరామాన్ని కూడా ప్రకటించింది. గతేడాది విద్యా సంవత్సరంలో మాదిరిగానే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఏడు పేపర్లుగా నిర్వహిస్తారు.

మార్చి 17 నుంచి పరీక్షలు

పదో తరగతి పరీక్షలు మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు. సోషల్ పరీక్ష మార్చి 31వ తేదీతో పూర్తవుతాయి. పరీక్షల షెడ్యూల్‌ను ఇప్పటికే విడుదల చేశారు. ప్రతీ పరీక్షకు మధ్య ఒకరోజు విరామం ఇవ్వడం వల్ల విద్యార్థులకు కొంత విశ్రాంతి లభిస్తుంది.

ఒత్తిడి తగ్గి బాగా చదువుకోవచ్చు

ఈ విధమైన పరీక్షల నిర్వహణతో విద్యార్థులలో ఒత్తిడి తగ్గి పరీక్షలు బాగా రాసే అవకాశాలున్నాయి. సబ్జెక్టుకు సబ్జెక్టుకు మధ్యలో సెలవు రావడం ఎంతో ఉపయోగకరం.

– సామల సింహాచలం,
ఎంఈఓ – 1, బలిజిపేట

● గతంలో ఇలా..

పదవ తరగతి పరీక్షలు చాలా సంవత్సరాల పాటు 11పేపర్లను నిర్వహించేవారు. హిందీ మినహా తెలుగు, ఇంగ్లిష్, గణితం, సోషల్ సబ్జెక్టుల్లో ప్రతీ సబ్జెక్టుకు 50మార్కుల వంతున రెండు పేపర్లు నిర్వహించేవారు. సైన్సులో ఫిజిక్స్, బయాలజీ సబ్జెక్టులకు సంబంధించి 50మార్కుల వంతున రెండు పేపర్లు ఉండేవి. ఒక్కో పరీక్షను ఒక్కో రోజు వంతున 11రోజులు నిర్వహించేవారు. కరోనా ప్రభావంతో 2019 – 20, 2020 – 21 విద్యా సంవత్సరాల్లో పబ్లిక్ పరీక్షలను రద్దు చేశారు. కరోనా తీవ్రత తగ్గడంతో 2021 – 22విద్యా సంవత్సరంలో పబ్లిక్ పరీక్షలు నిర్వహించి 11పేపర్లను 7పేపర్లుగా కుదించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సోషల్ సబ్జెక్టులకు ఒక్కో పేపరుకు 100మార్కుల వంతున, ఫిజిక్స్, బయాలజీ పేపర్లను ఒక్కో పేపరును 50మార్కుల వంతున నిర్వహించారు.

● ఈ ఏడాది పరీక్షలు ఇలా..

2022 – 23విద్యా సంవత్సరంలో పది పరీక్షలను ఆరు పేపర్లకు కుదించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో ఒక్కో సబ్జెక్టుకు 100మార్కులకు పేపరు నిర్వహిస్తున్నారు. సైన్స్ సబ్జెక్టులో మాత్రం ఫిజికల్ సైన్స్, బయాలజీ సబ్జెక్టులకు సంబంధించి ఒకే ప్రశ్నాపత్రాన్ని ఇచ్చారు. అయితే జవాబులు మాత్రం వేర్వేరు సమాధాన పత్రాల బుక్‌లెట్స్‌లో రాయాల్సి వచ్చేది. గత విద్యా సంవత్సరం పబ్లిక్ పరీక్షల్లో సీఎస్, బయాలజీ జవాబు పత్రాలను సంబంధిత ఉపాధ్యాయులు మూల్యాంకనం చేయడానికి వీలుగా ఇలా వేర్వేరు జవాబు పత్రాల్లో రాయించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించి, పరీక్షలపై ఉండే భయాన్ని పోగొడుతుందని ఉపాధ్యాయులు, తల్లితండ్రులు భావిస్తున్నారు. 2024 – 25 విద్యా సంవత్సరంలో నిర్వహించే పది పబ్లిక్ పరీక్షల్లో కూడా ఆరు సబ్జెక్టులకు ఏడు పరీక్షలుగా నిర్వహిస్తున్నారు.

మహిళాశక్తిని పెంపొందించేలా కార్యక్రమాలు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, మంత్రి సంధ్యారాణి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

పార్వతీపురం టౌన్: బాలికల హక్కులను పరిరక్షిస్తూ, వారి అవసరాలను తీర్చగలిగితే సమాజంతో పాటు ప్రపంచాన్ని మార్చగలిగే శక్తిమంతులు బాలికలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో భేటీ బచావో.. భేటీ పఢావో కార్యక్రమం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా శక్తిని మరింత పెంపొందించడానికి అనేక కార్యక్రమాలను చేపడుతున్నట్టు తెలిపారు. మహిళలు లేని సమాజమే లేదని, ప్రస్తుత భారత రాష్ట్రపతి కూడా ఒక మహిళేనని గుర్తు చేసారు. ఆత్మ విశ్వాసంతో చదువుకొని అనుకున్న లక్ష్యాలను సాధించిన మహిళామణులు ఎందరో ఉన్నారని, వారంతా నేటి కిశోరి బాలికలకు స్ఫూర్తిదాయకమన్నారు. వారంతా విద్యతోనే అనుకున్న లక్ష్యాలను సాధించగలిగారని అన్నారు. అదే స్ఫూర్తితో ప్రతి ఆడపిల్ల విద్యనభ్యసించి మంచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ట్రైకార కార్పొరేషన్ సంచాలకులు పువ్వల లావణ్య, కాపు కార్పొరేషన్ సంచాలకులు గండి రామినాయుడు, కొప్పుల వెలమ కార్పొరేషన సంచాలకులు గొట్టాపు వెంకటనాయుడు, మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు చిన్మయిదేవి, జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి టి.కనకదుర్గ, ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోరి బాలికలు, తల్లిదండ్రులు, ఇతర అధికార ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

పాచిపెంట: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని సాలూరు రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం పి.కోనవలస ఏపీటీ డబ్ల్యూ జూనియర్ కళాశాల ఆవరణలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి రామకృష్ణ ముఖ్య అతిథిగాపాల్గొని పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించి జిల్లాకు, రాష్ట్రానికి, మంచిపేరు తీసుకురావాలన్నారు. ప్రతి ఓటమి మరో గెలుపునకు నాంది పలుకుతుందని, పోటీల్లో ఓడిన వారు నిరుత్సాహం చెందకుండా రాబోయే ఆటల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. విద్య అనేది మనిషికి జ్ఞానాన్ని ఇచ్చి ఎలా మెరుగుపరుస్తుందో.. అదే విధంగా క్రీడలు కూడా మన జీవితానికి ఎన్నో పాఠాలు నేర్పిస్తాయన్నారు. విద్యతో పాటు క్రీడలు కూడా మనలో భాగస్వామ్యం అయినప్పుడు పరిపూర్ణత గల మనిషిగా అభివృద్ధి చెందుతారన్నారు. ఎస్ఐ వెంకట్ సురేష్ మాట్లాడుతూ ఈ పోటీలలో మొత్తం 38 జట్లు పాల్గొన్నాయని, విజేతగా నిలిచిన జట్టు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రైతు ప్రదర్శన



గొచెక్క గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న గిరిజన సంక్షేమ సంఘం నేతలు

పార్వతీపురం టౌన్: పార్వతీపురంలో ఆదివారం జరిగే రైతు ప్రదర్శనలో పాల్గొని విజయవంతం చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్, అయ్యార్ల సంఘం జిల్లా కార్యదర్శి పి.సంగం పిలుపునిచ్చారు. పార్వతీపురం మండలంలోని బొడ్డవలస, గొచెక్క, లిడికివలస, తాళ్లబురిడీ, కొత్తవూరు, మరికి తదితర గ్రామల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసారు. పంటలకు మద్దతు ధర ఇవ్వాలని, నల్ల చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేసారు. ఉపాధి పథకంలో వేతనం, పని దినాలు పెంచాలని కోరారు. ఆదివారం పార్వతీపురం పాత బస్టాండ్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు జరగనున్న ప్రదర్శనలో అన్ని వర్గాల ప్రజలు, రైతులు, రైతు కూలీలు, వ్యవసాయ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సూపర్ సిక్స్‌ను అమలు చేయాలి

- కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ నిరసన



కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పార్వతీపురం: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని భారతీయ జాతీయ కాంగ్రెస్ పార్వతీపురం నియోజకవర్గం ఇన్‌చార్జ్ బత్తిన మోహన్‌రావు డిమాండ్ చేసారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగల దాలినాయుడు, తీళ్ల గౌరీ శంకరరావు, సాయి శ్రీనివాస్, పీవీ రమణ తదితరులతో కలిసి పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద శనివారం థాలీ బజావో అంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన పాలకులు అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించారన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే కూటమి పాలన అవినీతిమయమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభల్లో రూపొందించిన ప్రణాళికల ఆధారంగా అభివృద్ధి పనులు ప్రారంభించాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జీపీడీపీ పథకం అమల్లో భాగంగా శనివారం ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ, గృహ నిర్మాణ శాఖ ఏఈ జానకీరాం, పంచాయతీ కార్యదర్శులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సామాజికపరమైన రహదారులు, కాలువలు, తాగునీరు, పారిశుద్ధ్య పనులు తదితర అభివృద్ధి పనులు నిర్దేశించిన గడువులోగా చేపట్టాలని సూచించారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ జానకీరాం మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న గృహాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: గ్రామాల్లో ఎంపిక చేసిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా వలంటీరు టీచర్లు తీర్చిదిద్దాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులు పాటు నిర్వహించిన ఉల్లాస్ శిక్షణ తరగతుల్లో ఆయన శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలంతా అక్షరాస్యులు కావాలని, అందుకు వలంటీరు టీచర్లలో ఒకొక్కరు 50 సంవత్సరాల్లోపు ఉన్న వారిలో 10 మందిని నియమించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. అందుకు అవసరమైన పుస్తకాలు ఇచ్చామన్నారు. అక్షర జ్ఞానంతోనే కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతాయన్న విషయాన్ని గుర్తించాలన్నారు. వ్యాపార పరంగా మహిళలు అభివృద్ధి చెందిన తమ పిల్లలను విద్యాధికులను చేయాలని సూచించారు. రెండు రోజుల్లో 143 మంది వలంటీరు టీచర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు, సీసీలు ఎం.సత్యంనాయుడు, కేపీ వసంత్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఎస్ ప్రాజెక్టులో చేప పిల్లలను విడిచిపెట్టిన మంత్రి

మక్కువ: మండలంలోని శంబర గ్రామం వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్‌లో శనివారం గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేప పిల్లలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజన మత్స్యకారుల ఉపాధి, అభివృద్ధి కోసం వీఆర్ఎస్ ప్రాజెక్ట్‌లో 24లక్షల 75వేల చేపపిల్లలను పెంపకం చేపడుతున్నట్లు తెలిపారు. దీనివలన 412 సొసైటీల పరిధిలో మత్స్యకారులకు మేలు జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని పెద్దగెడ్డ, ఆంధ్ర, వీఆర్‌ఎస్ జలాశయాల్లో చేప పిల్లలు విడిచిపెట్టామన్నారు. ఐటీడీఏ ద్వారా మత్స్యకారులకు వలలు, మెటార్ వాహనాలు అందించనున్నట్లు మంత్రి తెలిపారు. అనంతరం చదురుగుడిలోని శంబర పోలమాంబ అమ్మవారిని దర్శించుకొని, అమ్మవారి ఘటాల ఊరేగించారు. శంబర గ్రామంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. జాతర కొచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కవిరిపల్లి గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయాన్ని సందర్శించి, అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి



బళ్ళకృష్ణాపురంలో పరీక్షలు చేస్తున్న డీసీఎంఓ మూర్తి, హెచ్ఎస్ శర్మ

సీతానగరం: కుష్టు వ్యాధి రహిత సమాజ స్థాపనకు అందరూ సహకరించాలని, ఆరోగ్యపరమైన ఎటువంటి సమస్యలున్న వైద్య పరీక్షలు చేయించుకోవాలని డీపీఎంఓ మూర్తి అన్నారు. లెప్రసీ వ్యాధి లక్షణాలు గుర్తించే కార్యక్రమంలో భాగంగా శనివారం బళ్ళకృష్ణాపురంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి వ్యక్తి శరీరంపై స్పర్శ లేని మచ్చలు, శరీరంపై తిమ్మెర్లు, పుండ్లు తగ్గకపోవడం, శరీరం పాలిపోవడం, ముక్కు, చెవుల చివర్లు ఎర్రబారి కనిపించడం తదితర లక్షణాలు కనిపిస్తాయన్నారు. జిల్లాలో లెప్రసీ కేసులు నమోదు కావడం వలన ప్రత్యేక డ్రైవ్ నెల రోజులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపరువైజరు శర్మ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ డీడీ గయాజుద్దీన్

పార్వతీపురం టౌన్: పది, ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులపై హాస్టల్ వార్డెన్లు దృష్టి సారించాలని సాంఘిక సంక్షేమ డీడీ గయాజుద్దీన్ ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా వసతి గృహ వార్డెన్లతో స్థానిక కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. మార్చిలో జరగనున్న టెన్త్, ఇంటర్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో అధిక శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కోరారు. జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతిగృహ భవనాలు 13 ఉండగా, అందులో 11 భవనాలకు మైనర్, మేజర్ రిపేర్లు చేయించడానికి రూ.189 లక్షలు మంజూరయ్యాయని, టెండర్ల ప్రక్రియ జరుగుతున్నదని చెప్పారు. ఈ పనులను వసతి వార్డెన్ దగ్గరుండి ఫిబ్రవరి నెలాఖరులోగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ ఏడాది విద్యార్థులకు టవల్స్, స్పోర్ట్స్ మెటీరియల్, వంట పాత్రలు, స్టేషనరీ సౌకర్యాలకు సంబంధించిన సరుకులు ప్రభుత్వం ముందుగానే అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఏఎస్ఐ శ్రీనివాసరావు

సీతానగరం:

మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్ఐ ఎల్.శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో మహిళలకు చట్టాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవగాహన లేకే మోసపోతున్నారన్నారు. అలాగే మహిళలు తమ రక్షణ కోసం ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ద్వారా చాలా లబ్ధి పొందగలుగుతారన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం



పార్వతీపురం టౌన్: పట్టణంలో ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ వై.జయలక్ష్మి ఇతర అధికారులు

ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని పలువురు అధికారులు పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా పలుచోట్ల చైతన్య ర్యాలీలు, అవగాహన సదస్సులు శనివారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– పార్వతీపురం టౌన్



సీతానగరం: సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న గ్రామసర్పంచ్, గ్రామ పెద్దలు



బలిజిపేట: ఓటరు చైతన్య ర్యాలీలో పాల్గొన్న అధికారులు



పాచిపెంట: ఓటు హక్కుపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు